తెలంగాణ శాసనసభ
తెలుగు దినపత్రిక

దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం

సంప్రదించండి: 9100900931

TELANGANA SHASANA SABHA

TELTEL/2016/68867

# తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 196 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | శనివారం 21 డిసెంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

## కేటీఆర్ కుదుర్చుకున్న ఒప్పందం విలువ

# రూ.600 కోట్లు



- ఈ-కార్ రేసింగ్ ప్రతినిధులు తనను కలిశారన్న రేవంత్
- రూ. 600 కోట్ల డబ్బులు రావాల్సి ఉందని చెప్పారన్న సీఎం
- తానను జాగ్రత్త పడటం వల్ల రూ.450 కోట్లు మిగిలాయని వ్యాఖ్య

**శాసనసభ / హైదరాబాద్ :** ఫార్ములా ఈ-కార్ రేసింగ్ పై శాసనసభలో చర్చ చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ సభ్యులు గందరగోళం సృష్టించారు. స్పీకర్ పోడియంలోకి కూడా దూసుకుపోయారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... అసెంబ్లీలో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ పై చర్చించాలని ఇంతకాలం కేటీఆర్ ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ఈ-కార్ రేసింగ్ ప్రతినిధులు తనను కలిశారని... రూ. 600 కోట్ల పెండింగ్ నిధులు రావాల్సి ఉందని... వాటిని ఇవ్వాలని అడిగారని రేవంత్ చెప్పారు. మీరు ఓకే అంటే మరోసారి రేసింగ్ నిర్వహిస్తామని చెప్పారని తెలిపారు. ఎఫ్ఈవో ప్రతినిధులు తనను కలిసిన తర్వాతే తనకు ఈ విషయం తెలిసిందని చెప్పారు. కార్ రేస్ నిర్వాహకులతో కేటీఆర్ కుదుర్చుకున్న ఒప్పందం రూ. 600 కోట్ల విలువైనదని రేవంత్ అన్నారు. పెండింగ్ డబ్బుల కోసం నిర్వాహకులు తన వద్దకు వచ్చినప్పుడే ఆ విషయం తన దృష్టికి వచ్చిందని చెప్పారు. తాను జాగ్రత్త పడటం వల్ల రూ. 450 కోట్లు మిగిలాయని అన్నారు. ఈ విషయంపై ఏసీబీ విచారణ జరుగుతోందని అన్నారు. కేటీఆర్ వేసిన పిటిషన్ పై హైకోర్టులో విచారణ జరుగుతోందని... అందువల్ల తాను ఎక్కువ మాట్లాడడంలేదని చెప్పారు.



ఫార్ములా - ఈ కార్ రేస్.. మనీలాండరింగ్

# కేసు నమోదు చేసిన ఈడీ

**శాసనసభ / హైదరాబాద్ :** ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ అంశంపై ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు ఈసీఐఆర్ నమోదు చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం ప్రకారం మాజీ మంత్రి కేటీఆర్, అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, అప్పటి హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిపై ఈడీ కేసు నమోదు చేసింది. ఫార్ములా-ఈ కార్ రేస్ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై విచారణ జరిగింది. ప్రాథమిక దర్యాప్తు ఇప్పటికే పూర్తయినందున మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు.

మిగతా »»4లో

## రాష్ట్ర ప్రత్యేక

### అవసరాలను గుర్తించి కేంద్రం ప్రోత్సాహం అందించాలి



**శాసనసభ / హైదరాబాద్ :** దేశ అభివృద్ధిలో గ్రోత్ ఇంజిన్‌గా ఉండే తెలంగాణ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, రాష్ట్ర ప్రత్యేక అవసరాలను గుర్తించి తగిన ప్రోత్సాహం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. రాజస్థాన్‌లోని జైపూర్ వేదికగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో జరిగిన ప్రీ బడ్జెట్ సమావేశంలో భట్టి విక్రమార్క, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

## హామీలు అమలు చేయలేకే

# రేవంత్ రెడ్డి నాటకాలు ఆడుతున్నారు


- తొలి అడుగులోనే కేటీఆర్ నైతిక విజయం
- హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డి అబద్ధాలకు ఉదాహరణ
- రూ.600 కోట్ల నష్టం కాదు.. లాభం జరిగింది.
- ఈ కార్ రేస్ వల్ల హైదరాబాద్‌కు రూ.600 నుంచి రూ.700 కోట్ల లాభం జరిగిందని నెల్సన్ అనే సంస్థ చెప్పింది.



**శాసనసభ / హైదరాబాద్ :** ఫార్ములా-ఈ కార్ రేస్ కేసు వ్యవహారం తెలంగాణలో పెద్దఎత్తున రాజకీయ దుమారం లేపుతోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనపై ఏసీబీ నమోదు చేసిన కేసు విషయమై హైకోర్టును ఆశ్రయించారు. ఇవాళ(శుక్రవారం) విచారణ చేపట్టిన ధర్మాసనం వారం రోజులపాటు కేటీఆర్‌ను అరెస్టు చేయవద్దంటూ తీర్పు చెప్పింది. ఈ తీర్పుపై మాజీ మంత్రి హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. కేటీఆర్‌పై పెట్టింది డొల్ల కేసని తేలిపోయిందని ఆయన అన్నారు. తొలి అడుగులోనే కేటీఆర్ నైతిక విజయం సాధించారని చెప్పారు. హైకోర్టు తీర్పు రేవంత్ రెడ్డి అబద్ధాలకు ఉదాహరణ అని చెప్పుకొచ్చారు.

## మంత్రులకు

### సీఎం చంద్రబాబు క్లాసు.. మీ జాతకాలు నా వద్ద ఉన్నాయంటూ హెచ్చరికలు



- మంత్రుల పనితీరు పర్యవేక్షిస్తున్నానన్న సీఎం
- పలువురు మంత్రులు టెక్నాలజీ వాడటం లేదంటూ అసంతృప్తి
- జిల్లా ఇన్‌ఛార్జులుగా ఉన్న మంత్రులు మూడు పార్టీల సమన్వయ బాధ్యతలను తీసుకోవాలన్న చంద్రబాబు

4

# సభ్య సమాజం సిగ్గు పడేలా

## బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరిస్తున్నారు



- భూ భారతి బిల్లును ఆమోదించకుండా బీఆర్ఎస్ అడ్డుకుంటోందన్న పొంగులేటి
- ధరణి పోర్టల్ తప్పుల తడక అనే విషయం కేసీఆర్ కు తెలుసని వ్యాఖ్య
- బీఆర్ఎస్ సభ్యుల చిల్లర వేషాలను ప్రజలు హర్షించరన్న మంత్రి

**శాసనసభ / హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు వాడీవేడిగా కొనసాగుతున్నాయి. భూ భారతి బిల్లుపై ప్రభుత్వం చర్చిస్తుండగా... ఫార్ములా ఈ-రేస్ అంశంపై చర్చకు బీఆర్ఎస్ సభ్యులు పట్టుబడుతున్నారు. స్పీకర్ పోడియంలోకి కూడా బీఆర్ఎస్ సభ్యులు చొచ్చుకుపోయారు.

మిగతా »»4లో

# జైలుకెళ్లి

## యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు?



**శాసనసభ / హైదరాబాద్ :** పార్లమెంటులో అంబేద్కర్‌ను, అసెంబ్లీలో దళిత స్పీకర్‌ను అవమానించారని మంత్రి సీతక్క అన్నారు. అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్‌చాట్‌లో ఆమె మాట్లాడారు. క్యాబినెట్ ఆమోదం తీసుకొని ఫార్ములా ఈ-రేసుకు కేటీఆర్ డబ్బులు చెల్లించారా అని ప్రశ్నించారు. ప్రభుత్వ అనుమతి లేని అంశానికి సభలో చర్చ ఎందుకు అని అడిగారు.

మిగతా »»4లో

# కేసు విషయంలో నేనేం భయపడడం లేదు..



**శాసనసభ / హైదరాబాద్ :** కేసు విషయంలో నేనేం భయపడడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రోజీసర్ కరెక్ట్ గా లేదని అన్నారు.. అంతేకాని అవినీతి లేదని అన్నారు. వీళ్ళను తప్పుదోవ పట్టిస్తున్నాడు. ముఖ్యమంత్రిని కూడా ఎవరో తప్పుదోవ పట్టిస్తున్నారా లేక ముఖ్యమంత్రి నే అందరిని తప్పుదోవ పట్టిస్తున్నారో అర్థం కావడం లేదని కేటీఆర్ అన్నారు. నేను చెప్పాల్సిన విషయాలు అన్ని చెప్పడం జరిగిందన్నారు. నేనేం భయపడటం లేదన్నారు. అయిన మేము అలానే ముందుకు పోతాం అంటే పోనీ మేము కూడా లీగల్ గా ముందుకు వెళతామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు గురించి చెప్పాలన్నారు. క్యాబినెట్ సబ్ కమిటీ రిసోర్స్ మోబిలైజేషన్ అని ఉండేది. దానికి హరీష్ రావు చైర్మన్ ఉండేదని తెలిపారు. ఓఆర్ఆర్ పై టిఓటి విధానంపై మేము 7400 కోట్లు తెచ్చి రైతు రుణమాఫీ ఇవ్వడం జరిగిందని కేటీఆర్ అన్నారు. మేము టిఓటిని పారదర్శకంగా చేయడం జరిగిందన్నారు.

మిగతా »»4లో

# స్ఫూర్తి

## నేను .. నా కల .. నా ప్రపంచం!..

నేను .. నా కలం .. నా ప్రపంచం!..
ఎక్కడ సాటి మనిషిని ఎవ్వరూ ఎగతాళి చేయని,
ప్రేమ భూమిని ఆశీర్వదించే ప్రపంచాన్ని నేను
కలలు కంటున్నాను

మరియు శాంతి దాని దారులు అందరికి
మధురమైన
స్వేచ్ఛా మార్గాన్ని తెలుసుకోగల ప్రపంచాన్ని నేను
కలలు కంటున్నాను,

ఎక్కడ దురాశ ఆత్మను క్షీణింపజేయదు లేదా
దురభిమానం మన రోజును నాశనం చేయదు.
నలుపు లేదా తెలుపు వర్ణం ఊసు లేని కులం
మతం తావు లేక మీరు ఏ జాతి వారైనా, భూమి
యొక్క వరాలను పంచుకునే ప్రపంచం నేను
కలలు కంటున్నాను

మరియు ప్రతి మనిషి స్వేచ్ఛగా ఉంటాడు,
ఎక్కడ దౌర్భాగ్యం తలవంచుతుందో
మరియు ఆనందం పరిమలిస్తూ ముత్యంలాగా
ప్రకాశిస్తుందో
సకల మానవాళి అవసరాలను తీరుస్తుందో-
అలాంటి వాటి గురించి నేను కలలు కంటున్నాను,

అదే నేను .. నా కల .. నా ప్రపంచం!..

- భూతం ముత్యాలు

# ఇంధనం పొదుపు తప్పనిసరి

**ఉపాధ్యాయులు, విద్యార్థులతో ర్యాలీ**
**ఘనంగా ఇంధన పొదుపు వారోత్సవాలు**
**రంగారెడ్డి జిల్లా అధికారి సురేష్ రెడ్డి**



**యాచారం శాసన సభ న్యూస్ ( డిసెంబర్ 20) :** ప్రతి ఒక్కరు బాధ్యతగా ఇంధనాన్ని పొదుపు చేయాలని, ప్రపంచానికి ఇంధనం బోధన శక్తి అని ఇంధనం వనరుల అభివృద్ధి సంస్థ రంగారెడ్డి జిల్లా మేనేజర్ సురేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం యాచారం మండల ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ఇంధనం పొదుపు వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రస్తుతం ఉపయోగిస్తున్న ఇంధనంలో సగభాగం బొగ్గు, చమురు తో వాతావరణం కలుషితమయ్యేలా ఉన్నదని అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఇంధనం పొదుపు పై పెయింటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీలో వైష్ణవికి మొదటి బహుమతి, రెండవ బహుమతి నిహారిక కు, మూడవ బహుమతి మీనా కు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నరసింహ, ఇతర ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి:

**సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ**




**చండూర్ డిసెంబర్ 20 (శాసనసభ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ గౌడ్ అన్నారు. శు క్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తాసిల్దార్ నిర్మలాదేవికి రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం చండూరు మండల కమిటీ, తెలంగాణ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు రైతు రుణమాఫీ,రైతు భరోసా,పూర్తిగా రైతు ఖాతాలో జమ చేయాలని,పెండింగ్ లో ఉన్న రుణమాఫీ,రైతు భరోసా సమస్యలను పరిష్కరించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతాంగానికి వ్యవసాయ పెట్టుబడులకు రైతులకు ఇచ్చే ప్రోత్సాహం మూడు పంటలకు ఇవ్వాల్సిన పెట్టుబడులు ఇవ్వకపోవడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. బ్యాంకులలో రైతులకు అప్పులు ఉన్నటువంటి వారందరికీ రుణమాఫీ చేయకపోవడం వలన రైతులకు వడ్డీ భారంగా మారుతుందన్నారు. రుణమాఫీ డబ్బులు రైతు ఖాతాలో జమ చేయకపోవడం వలన బ్యాంకర్లు తిరిగి పంట రుణాలు ఇచ్చే దగ్గర రైతులను ఇబ్బంది పెడుతున్నార న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన రైతు రుణమాఫీ,రైతు భరోసా ఇవ్వాలని అన్నారు. రుణమాఫీ కానటువంటి రైతులందరికీ రుణమాఫీ చేయాలని, రైతులు ఎంతైతే రుణమాఫీ అయిందో అంత పంట రుణం తిరిగి చెల్లించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వ్యవసాయ పెట్టుబడులకు రెండు పంటలకు రైతు భరోసా, రైతులందరికీ రైతు ఖాతాలలో జమ చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఈరటి వెంకటయ్య,కొత్తపల్లి నరసింహ,బొమ్మరగొని యాదయ్య , సిఐటియు హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు బిక్షం, కుమార్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ పై అమిత్ షా మాట్లాడిన వాక్యాలను వెంటనే ఉపసంహరించుకోవాలి

**కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్**



**యాచారం శాసన సభ న్యూస్ ( డిసెంబర్ 20):.** కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా పార్లమెంటు సమావేశాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై చేసిన వాక్యాలను వెంటనే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రత్యక్ష పార్టీలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని తలుచుకునే బదులు, కనీసం స్వర్గానికైనా చేరుకునే ఉండేవారని అమీషా అనడం రాజ్యాంగ నిర్మాతని అవమానించడం ఆయన తప్పు పట్టారు. దేశంలో బడుగు బలహీన వర్గాల, దళితులను అవమానించేలా వాక్యాలు ఉన్నాయని అన్నారు. దేవుడునైనా కనీసం మొక్కితే స్వర్గానికి వెళ్ళొచ్చని ప్రతిపక్షాలను హేళన చేయడం , మతాల మధ్యను చిచ్చుపెట్టే విధంగా ఉందన్నారు. దేశ ప్రజలకు హెూం శాఖ మంత్రి భావవాదానికి , ఆలోచన విధానం మారే విధంగా వాక్యాలు చేయడం దేశానికి సిగ్గుచేటని ఆయన ఎద్దేవ్య చేశారు. ఇప్పటికైనా హెూం శాఖ మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# సి.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులు అందజేత



**జహీరాబాద్, శాసనసభ న్యూస్ డిసెంబర్ 20 :** జహీరాబాద్ నియోజకవర్గం లోని న్యాల్కల్, కోహీర్ మండలాలలోని వివిధ గ్రామాలకు చెందిన సీ.ఎం.ఆర్.ఎఫ్ చెక్కులను తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్. గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డా.సిద్ధం ఉజ్వల్ రెడ్డి ఆదేశాల మేరకు జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శనగర్ గిరిధర్ రెడ్డి గెస్ట్ హౌస్ లో లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 7,46,500/- రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు పి. నర్సింహ్మారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వీ. రాములు, సిడిసి డైరెక్టర్ మల్లారెడ్డి, మాజీ కౌన్సిలర్ శేఖర్, యూత్ కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కె. జగదీశ్వర్ రెడ్డి, బి. మల్లికార్జున్, సోమప్ప, రాములు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# శ్రీ అయ్యప్ప స్వామి 18వ మెట్టు మహా పడి

## పూజ కార్యక్రమంలో పాల్గొన్న - ఎమ్మెల్యే






**చండూర్ డిసెంబర్ 20 (శాసనసభ న్యూస్):** మునుగోడు నియోజకవర్గం లో చండూరు మున్సిపాలిటీ పరిధిలోని అక్కినేని గూడెం రామాలయం ప్రాంగణంలో శుక్రవారం రోజు చండూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి వెంకటేష్ యాదవ్ గురుస్వామి పదునెట్టాంబడి పూజ కార్యక్రమం శ్రీ శ్రీ శ్రీ తంత్రి సత్యనారాయణ గురు స్వామి ఆధ్వర్యంలో పూజ కార్యక్రమం కలుషాబిషేకాలు వైభవం గా నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిది గా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శ్రీ అయ్యప్ప స్వామి 18వ మెట్టు మహా పడి పూజ లో సంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక పూజలు కార్యక్రమంలో పాల్గొన్నారు. పడి పూజ నిర్వాహకుడు దోటి వెంకన్న యాదవ్ స్వామి తో కలిసి 18 మెట్ల మహాపూజ జ్యోతిని వెలిగించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి. ఈ కార్యక్రమం లో వారు మాట్లాడుతూ అయ్యప్ప పడి పూజ లో పాల్గొనడం చాలా సంతోషం గా ఉంది అన్నారు. అదేవిదంగా అయ్యప్ప ఆశీస్సుల తో ఈ ప్రాంత ప్రజలు సుఖ సంతోషాలతో, ఉండాలని వారు కోరారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా పాదునెట్టాంబడి పుస్తకావిష్కరణ, శరణు శరణు అయ్యప్ప ఆడియో పాట ను వారు ఆవిష్కరించడం జరిగింది. పడి పూజ కార్యక్రమం లో చింతపల్లి గిరి గురు స్వామి భజన మండలి భక్తులను అయ్యప్ప పాటల తో అలరించరించడం జరిగింది. ఈ మహెూన్నత కార్యక్రమానికి చండూర్ మున్సిపల్, మండల పరిధి లోని అయ్యప్ప స్వాములు, భక్తులు వివిధ మండలాల లోని ముఖ్య నాయకులు పాల్గొనడం జరిగింది.

# పట్నంమార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డికి ఘనంగా సన్మానం

**- ఇబ్రహీంపట్నం నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సన్మానం.**



**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 20 :** ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గా ఎన్నికైనటువంటి కంబాలపల్లి గురునాథ్ రెడ్డి, డైరెక్టర్ తాళ్ల మహేష్ గౌడ్‌ను శుక్రవారంనాడు ఇబ్రహీంపట్నం నాయి బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఇబ్రహీంపట్నం నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు మంకాల ఉదయకుమార్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు మంకాల వెంకటేష్, ఉపాధ్యక్షులు మంకాల శ్రీను, ప్రధాన కార్యదర్శి మంకాల అనిల్ కుమార్, కోశాధికారి మంకాల ప్రవీణ్, లీగల్ అడ్వైజర్ అశోక్, భాస్కర్, జగదీష్,శేఖర్, యాదగిరి, రాజు, సురేష్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# తొలిసారి సిపిఎం మండల కమిటీ లో మహిళకు సముచిత స్థానం

**అచ్చన్న పద్మ ఎంపిక**
**చింతపట్ల సిపిఎం గ్రామ శాఖ అభినందన**



**యాచారం శాసన సభ న్యూస్ (డిసెంబర్ 20):.** యాచారం మండల కేంద్రంలో సిపిఎం ఎనిమిదవ మండల మహాసభ డి ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్ వెస్లీ హాజరయ్యారు. మండల పరిధిలో చింతపట్ల గ్రామానికి చెందిన అచ్చన్న పద్మ ను తొలిసారిగా సిపిఎం మండల కమిటీ లో సముచిత స్థానం కల్పించారు. చింతపట్ల సిపిఎం గ్రామ శాఖ ఆమెకు అభినందనలు తెలిపారు. ఆమె చింతపట్లలో సిపిఎం నుండి ఎంపీటీసీగా, సర్పంచ్ రెండు సార్లు పోటీ చేసి స్వల్ప మెజార్టీతో ఓటమి చెందారు. అయినా నిత్యం ప్రజల కోసం, ప్రజా సమస్యల పైన, పార్టీ సిద్ధాంతాల మేరకు ఆమె పని చేయడం ఆ పార్టీ నాయకులు గుర్తించి మండల కమిటీ సభ్యురాలుగా ప్రకటించడం ఆమె ఆనందం వ్యక్తం చేసింది. పార్టీ పదవి బాధ్యతలు స్వీకరించడం సిపిఎం రాష్ట్ర ,జిల్లా, మండల, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# బాబా సాహెబ్ అంబేద్కర్ కి క్షమాపణలు చెప్పాలి - ఎమ్ డి సమీర్



**చండూర్ డిసెంబర్ 20 (శాసనసభ న్యూస్) :** భారతరత్న రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ మీద మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వాక్యాలను ఖండిస్తూ ఎన్ ఎస్ యు ఐ పట్టణ అధ్యక్షులు ఎమ్ డి సమీర్ నిరసన తెలిపారు. నిండు సభలో గొప్ప మహనీయుని కించపరిచి మాట్లాడడం సరికాదని. హెూం మంత్రి అమిత్ షా తమ మాటలని వెంటనే వెనక్కి తీసుకోనీ అంబేద్కర్ కి క్షమాపణ చెప్పాలని ఎన్ ఎస్ యు ఐ పట్టణ అధ్యక్షులు ఎమ్ డి.సమీర్ డిమాండ్ చేయడం జరిగింది.

# ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించిన కలెక్టర్




**జహీరాబాద్, శాసనసభ న్యూస్ డిసెంబర్ 20 :** సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి శుక్రవారం జహీరాబాద్ సమీపంలోని రంజోల్ ను సందర్శించి, ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పరిశీలించారు. మొబైల్ ఆప్ లో అర్హుల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా రంజోల్ పరిదిలో ఉన్న సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం బోజన వసతి అందించాలని సూచించారు. కలెక్టర్ విద్యార్థినిలతో కలిసి బోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వర్, జహీరాబాద్ తహసీల్దార్ రవీందర్, ఎంపిడిఓ మహేందర్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ మరియు ఇతరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు సీఎం రేవంత్ అంగీకారం!



**శాసనసభ / హైదరాబాద్ :** ఎన్టీఆర్ కుమారుడు నందమూరి మోహనకృష్ణ, ఎన్టీఆర్ లిటరేచర్ సభ్యులు మధుసూదన రాజు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా, గత ఏడాదిన్నర కాలంగా ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చేపట్టిన కార్యక్రమాలను ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డికి వివరించి, హైదరాబాద్‌లో 100 అడుగుల ఎత్తుతో ఎన్టీఆర్ విగ్రహాన్ని నెలకొల్పాలన్న సంకల్పాన్ని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. అలాగే ఎన్టీఆర్ నాలెడ్జి సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని,ఓ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలను కొంటున్నామని. ఇందుకుగాను తెలంగాణ ప్రభుత్వం తరఫున స్థలాన్ని కేటాయించి సహకరించాలని కోరగా హైదరాబాద్‌లో, ప్రత్యేకించి ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో నందమూరి తారక రామారావు 100 అడుగుల విగ్రహం ప్రతిష్టాపనకు మరియు ఎన్టీఆర్ నాలెడ్జ్ సెంటర్ ఏర్పాటు కోసం ప్రభుత్వపరంగా స్థలం కేటాయించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంగీకరించడం ఎంతో సంతోషం అని నందమూరి మోహనకృష్ణ వెల్లడించారు. అలాగే ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చేస్తున్న కార్యక్రమాలను తెలుసుకొన్న సీఎం రేవంత్ రెడ్డి వారిని అభినందించారు. ఎన్టీఆర్ తెలుగు ప్రజలందరికీ ఇష్టమైన నటుడు, నాయకుడని.. ఆయన 100 అడుగుల విగ్రహం హైదరాబాద్‌లో ప్రతిష్టించాలన్న ప్రతిపాదనకు తమవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల స్పందనకు ఎన్టీఆర్ అభిమానులందరూ సంతోషిస్తారని, ఆయనకు ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ తరఫున కృతజ్ఞతను, ధన్యవాదాలు తెలియ చేస్తున్నామని అన్నారు.

# వడ్లలోడుతో వెళుతున్న డీసీఎం బోల్తా



**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 20 :** శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో వడ్ల లోడుతో గజ్వేల్ నుంచి ఇబ్రహీంపట్నం పోచారం వైష్ణవి రైస్ మిల్ కు వస్తున్న ఒక డీసీఎం లారీ 15టిఏ 8019 అదుపుతప్పి మంగళపల్లి చర్చి వద్ద బోల్తా పడటం జరిగింది. దీంతో డ్రైవర్ కు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ పేరు శ్రీను గజ్వేల్ గ్రామ నివాసి అని ఎస్ ఐ రామకృష్ణ తెలిపారు.

# ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

● సుమారు పది లక్షల విలువచేసే 17 ద్విచక్ర వాహనాలు స్వాధీనం.

● వివరాలు వెల్లడించిన దేవరకొండ డిఎస్పి గిరిబాబు.

**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 20 :** ఇటీవల దేవరకొండ నియోజకవర్గం లోని చింతపల్లి, గుడిపల్లి, కొండమల్లేపల్లి, దేవరకొండ, మాడుగుల, యాచారం పలు ప్రాంతాలలో ద్విచక్ర వాహనాలు చోరీకి గురైన విషయం విదితమే. వివరాల్లోకెళ్తే దేవరకొండ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో వరుస బైక్ దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాలతో దేవరకొండ డి.ఎస్.పి నేతృత్వంలో కొండమల్లేపల్లి సిఐ, ఎస్సై వారి టీం ప్రత్యేక బృందంగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానంతో బైకుల దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను గుర్తించారు. ఈరోజు ఉదయం నమ్మదగిన సమాచారం మేరకు వాహనాల తనిఖీలో భాగంగా కొండమల్లేపల్లి చౌరస్తాలో పైన పేర్కొన్న బైక్ దొంగల ముఠాను పట్టుబడి చేసి వారిని విచారించగా కొత్త విషయాలు బయటకు వచ్చాయి. ఈ దొంగలు ముఠాగా ఏర్పడి జల్సా లకు, చెడు అలవాట్లకు బానిసై రాత్రి సమయంలో ఇంటి ముందల ఓపెన్ ఏరియాలలో పార్కు చేసిన బైకులను టార్గెట్ చేసి వారి వద్ద తెచ్చుకున్న తయారుచేసిన తాళాలు ద్వారా బైకులను దొంగిలించారు. ఈ దొంగలు కొండమల్లేపల్లి ,



గుడిపల్లి ,దేవరకొండ ,చింతపల్లి మాడుగుల, యాచారం మండలాల పరిధిలో సుమారు 17 బైకులు దొంగిలించినారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి వారి వద్దనుండి సుమారు పది లక్షల విలువ చేసే 17 బైక్ లను స్వాధీనపరచుకున్నారు. దొంగల ముఠా

**అరెస్టు చేసిన నిందితుల వివరాలు.**

1) భక్తోజు శివ ఏ లడ్డు తండ్రి రవి, వయస్సు 19, వృత్తి బైక్ మెకానిక్, నివాసం చింతపల్లి.

2) ఆ రెండు గౌతమ్ ఏ చింటూ తండ్రి నగేష్ , వయస్సు 19 సంవత్సరాలు , విద్యార్థి , నివాసం చింతపల్లి



3) వరికుప్పల అశోక్ తండ్రి వెంకటయ్య 19 విద్యార్థి, చింతపల్లి.

4) సురకారపు శివఏ కరీం తండ్రి రమేష్, 19 విద్యార్థి, నివాసం చింతపల్లి.

కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న కొండమల్లేపల్లి సిఐ ధనుంజయ, ఎస్సైలు రామ్మూర్తి, నరసింహ్మలు వారి క్రైమ్ సిబ్బంది హేము నాయక్, భాస్కర్, వెంకటేష్, శేఖర్ రెడ్డి మరియు హోంగార్డు లక్ష్మయ్య, రమేష్ లను లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# హద్దుల్లేని కేటీఆర్ అక్రమాలతో వారు బలి



**శాసనసభ / హైదరాబాద్ :** మాజీ మంత్రి కేటీఆర్‌పై ఈ ఫార్ములా కేసు సక్రమమే అని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.శుక్రవారం మండలి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. ఫార్ములా ఈ కారు రేసులో అక్రమాలు జరిగిన మాట వాస్తవమన్నారు. అక్రమాలు జరిగినట్టు పలు ఆధారాలున్నా... కడిగిన ముత్యమంటూ కేటీఆర్ తనకు తానే సర్టిఫికేట్ ఇచ్చుకోవడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వం పంపిన ఆధారాలపై గవర్నర్ న్యాయసలహా తీసుకొని కేసుకు అనుమతించాక ఇది అక్రమ కేసు ఎలా అవుతుందని ప్రశ్నించారు.

**కేటీఆర్‌కు హైకోర్టు షాక్..**

చట్టపరంగా కేసు నమోదు అయినందున దీనిపై అసెంబ్లీలో కాదు, కోర్టులో తేల్చుకోవాలని సలహా ఇచ్చారు. హెచ్ఎమ్‌డీఏ భాగస్వామ్యం కాకున్నా.. దాని ఖాతా నుంచి ఆర్థికపరమైన అనుమతులు లేకుండానే రూ.54.88 కోట్లు చెల్లించేలా కేటీఆర్ ఒత్తిడి తెచ్చారన్నారు. ఆధారాలు కనిపిస్తున్నా.. అక్రమాలకు పాల్పడలేదని కేటీఆర్ బుకాయిస్తున్నారని మండిపడ్డారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలాగా కాంగ్రెస్ అక్రమంగా కేసులు బనాయించట్లేదని తెలిపారు. రేసింగ్ స్కాంలో నిబంధనల ప్రకారం గవర్నర్ అనుమతి తీసుకునే అధికారులు ముందుకెళ్తున్నారని చెప్పారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగానే నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కంపెనీలకు ఫండ్స్ మంజూరు ఎలా చేస్తారని ప్రశ్నించారు. హద్దుల్లేని కేటీఆర్ అక్రమాలతో అధికారులు బలిపశువులుగా మారారన్నారు.

నిబంధనలు పాటించకుండా పెద్ద మొత్తంలో విదేశాలకు నిధులు బదిలీ చేయడంతో హెచ్ఎండీఏ ఆదాయ పన్ను శాఖకు రూ.8 కోట్లకు పైగా పన్ను చెల్లించాల్సి వచ్చిందన్నారు. నిబంధనలను కాదని మూడేళ్లలో రూ.600 కోట్లు చెల్లించేలా ఒప్పందం కేటీఆర్ అనుమతితోనే జరిగిందని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా హుస్సేన్‌సాగర్ చుట్టూ ఫార్ములా ఈకారు రేసు కోసం 2.8 కి.మీల ప్రత్యేక ట్రాక్‌ను ఏర్పాటు చేశారన్నారు. నిబంధనలను అతిక్రమించి ప్రజలను ఇబ్బంది పెట్టడం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజిని పెంచడమా అని నిలదీశారు. బీఆర్ఎస్ నేతల దోపిడీతోహైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతిందని వ్యాఖ్యలు చేశారు.

**ఫార్ములా ఈరేస్ కేసుపై కేటీఆర్ ఏమన్నారంటే**

బీఆర్ఎస్ నేతలు ఏం చేసినా వారి స్వలాభం కోసమే? అని.. తెలంగాణ, హైదరాబాద్ కోసం కాదని ఈ అక్రమాలే నిరూపిస్తున్నాయన్నారు. ఫార్ములా ఈ కారు రేసు పేరుతో నిధులు గోల్‌మాల్ చేసి ఇప్పుడు సుద్ధపూసగా మాట్లాడుతున్నారంటూ వ్యాఖ్యలు చేశారు. ప్రజలు ఛీకొట్టి గద్దె దింపినా ఇంకా అధికారంలోనే ఉన్నామనే భ్రమలతో కేటీఆర్ బెదిరింపుల వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కేసులో అధికారులకు సహకరించాల్సిన కేటీఆర్ అహంకారంతో విర్రవీగుతూ, ఉద్యమకారులం భయపడం అంటూ కేసుకు సంబంధంలేని మాటలు మాట్లాడుతున్నారని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యలు చేశారు.

# వివాహ వేడుకల్లో పాల్గొన్న టి ఎస్ ఎస్ సి సి డి మాజీ చైర్మన్ వై. నరోత్తం



**జహీరాబాద్ శాసన సభ డిసెంబర్ 20 :** న్యాలకల్ మండలం ముంగి గ్రామం ఆదిలక్ష్మి మందిరంలో ఈ రోజు జరిగిన వివాహ వేడుకలో టి ఎస్ ఎస్ సి సి డి సిమాజీ చెర్మన్ వై. నరోత్తం హాజరై, నూతన వధు-వరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ వివాహ కార్యక్రమంలో గార్లపల్లి శివరాజ్, చెంగల్ జైపాల్, హెచ్.ప్రశాంత్, బి.కీరప్ప, దిలీప్ ఇతరులు పాల్గొన్నారు.

# శాంతికి సంకేతం క్రిస్మస్ పర్వదినం

## - మాజీ మంత్రి జహీరాబాద్ ఇంచార్జ్ డాక్టర్ చంద్రశేఖర్ రావు.





**జహీరాబాద్, శాసనసభ న్యూస్ డిసెంబర్ 20 :** జహీరాబాద్ పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్‌లో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు, జహీరాబాద్ ఇంచార్జి డాక్టర్ ఏ. చంద్రశేఖర్ హాజరై కేక్ కట్ చేసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ఏసు క్రీస్తు పుట్టినరోజుగా క్రైస్తవులు జరుపుకుంటారని తెలిపారు. క్రిస్మస్ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో సంతోషాన్ని తీసుకురావాలని, ప్రజలు ఆనందంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింహులు, మండల అధ్యక్షులు మక్సుద్, రామలింగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ హర్షద్ అలీ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్, ముర్తల్, ఎ.ఎం.సి డైరెక్టర్ వంశీ, మొయిజ్, రాజ్ కుమార్, పాస్టర్లు రవి, రమేష్, బాబు, జైపాల్, పాల్ రాజ్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఐకియా వాహనంలో గంజాయి సరఫరా..

## సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు ఇస్తున్న డ్రైవర్లు



**శాసనసభ /హైదరాబాద్ :** ఐకియా అంటే ఫర్నీచర్ అమ్మకాలకు బ్రాండ్ అంబాసిడర్. హైదరాబాద్ ఐకియా కంపెనీలో కొనుగోలు చేసిన ఫర్నీచర్ ఐటమ్‌ను వ్యాన్లలో సరఫరా చేసి..తిరుగు ప్రయాణంలో గచ్చిబౌలి ప్రాంతంలో పనిచేసే ఐటీ ఉద్యోగులతో సంబంధాలు పెట్టుకొని వారికి గంజాయి సరఫరా చేస్తూ అదనపు ఆదాయం సంపాందించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో.. వారిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టెలికాం నగర్, గచ్చిబౌలి ప్రాంతంలోని జీహెచ్ఎంసీ పార్కు ప్రాంతంలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఐకియా సరుకులు రవాణ చేసే వ్యాన్‌లో తనిఖీలు నిర్వహించగా 1.12 కేజీల గంజాయి పట్టుబడింది. ఐకియా వాహనాల డ్రైవర్లు గచ్చిబౌలి ప్రాంతంలోని ఉన్న వ్యక్తులకు గంజాయి తీసుకు వచ్చి ఇస్తుంటారు. కాగా.. గంజాయి అక్రమ రవాణదారులు ఫర్నీచర్ రవాణ చేసే వ్యాన్ డ్రైవర్లను వినియోగించుకున్నారు. గంజాయి సరఫరా చేసిన మహేష్, సిద్ధు అనే వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ నాగర్ కర్నూల్‌కు చెందిన వారిగా గుర్తించారు. గంజాయిని పట్టుకున్న వారిలో ఎస్సై జ్యోతి, హెడ్‌కానిస్టేబుల్ అలీమ్.. కానిస్టేబుళ్లు లేఖ సింగ్, కార్తీక్, రాంచందర్‌లు ఉన్నారు. కాగా.. గంజాయిని పట్టుకున్న ఎస్ టి ఎఫ్ టీమ్‌ను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ భాస్కర్, డీఎస్పీ తిరుపతి యాదవ్ అభినందించారు. మరోవైపు.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని తొండుపల్లి వద్ద బెంగళూరు జాతీయ రహదారిపై భారీగా గంజాయి పట్టుకున్నారు పోలీసులు. గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. బెంగళూరు నుండి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. గంజాయితో పాటు కారును స్వాధీనం చేసుకుని.. నిందితులను అరెస్టు చేశారు. మరొక చోట భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు పోలీసులు.. ముంబై నుంచి హైదరాబాద్ తరలిస్తున్న 320 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన వసీంను అరెస్టు చేసి డ్రగ్స్ స్వాధీన పరుచుకున్నారు టీఎస్ న్యాబ్. కాగా.. ముంబైకి చెందిన ఆర్యన్ పరారీలో ఉన్నట్లు టీఎస్ న్యాబ్ తెలిపింది. గత కొంత కాలం నుంచి బస్సులో డ్రగ్స్ తీసుకువచ్చి హైదరాబాదులో విక్రయిస్తున్నాడు వసీం. డ్రగ్స్‌కు అలవాటు పడి డబ్బుల కోసం విక్రయాలు చేస్తున్నాడు వసీం.

# చట్టాలు భర్తలను దోచుకునే సాధనాలు కాదు..

## భరణంపై సుప్రీం కీలక వ్యాఖ్య

**శాసనసభ /హైదరాబాద్ :** బెంగళూరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అతుల్ ఆత్మహత్య తర్వాత.. మహిళలు చట్టాలను ఉపయోగించుకుని చేస్తున్న అరాచకాలు దేశ వ్యాప్తంగా పెద్ద చర్చనీయాంశమైంది. తన భార్య, అత్త కుటుంబ సభ్యులు పెట్టిన వేధింపులను 90 నిమిషాల వీడియో ద్వారా..40 పేజీల లేఖలో తెలియజేసి అతుల్ ప్రాణాలు తీసుకున్నాడు. ఈ అంశం దేశ వ్యాప్తంగా సంచలన సృష్టించింది. మహిళలు చట్టాలను అడ్డం పెట్టుకుని ఎంత దారుణంగా ప్రవర్తిస్తున్నారో ఈ ఘటనతో వెలుగులోకి వచ్చింది. తాజాగా భరణంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. క్రిమినల్ చట్టాలలోని నిబంధనలు మహిళలను రక్షించడానికి మాత్రమేనని, అంతేతప్ప వారి భర్తలను శిక్షించడం, బెదిరించడం, ఆధిపత్యం చెలాయించడం లేదా బలవంతంగా వసూలు చేయడానికి కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. విడిపోయిన భార్యకు ఒక నెలలో రూ.12 కోట్ల శాశ్వత భరణం చెల్లించాలంటూ ధర్మాసనం ఆదేశించింది. విడిపోయిన భార్య.. తన భర్త సంపాదన నుంచి సమానమైన శాశ్వత భరణం కోరింది. ఈ మేరకు న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అయితే ఈ సందర్భంగా న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. చట్టాలు బలవంతంగా భర్తల నుంచి వసూలు చేయడానికి ఉద్దేశించినవి కావని స్పష్టం చేసింది. న్యాయమూర్తులు బీవీ నాగరత్న, పంకజ్ మిథాల్ మాట్లాడుతూ.. హిందూ వివాహాన్ని ఒక పవిత్రమైన బంధంగా పరిగణిస్తారని.. ఒక కుటుంబానికి పునాదిగా



పరిగణించబడతారన్నారు. అంతేతప్ప వివాహ వ్యవస్థ ''వాణిజ్య వెంచర్'' కాదని న్యాయమూర్తులు పేర్కొన్నారు. మహిళలు తమ చేతుల్లో ఉన్న చట్టాలను సంక్షేమానికి ఉపయోగించుకోవాలి కానీ.. భర్తలను శిక్షించడం కోసమో.. బెదిరించడం కోసమో.. లేదంటే ఆదిపత్యం చెలాయించడం కోసమో కాదని బెంచ్ పేర్కొంది. పోలీసు అధికారులు కూడా కొన్నిసార్లు సెలెక్టివ్ కేసుల్లో త్వరగా చర్య తీసుకుంటారని.. భర్త లేదా అతని బంధువులను కూడా అరెస్టు చేస్తున్నారని బెంచ్ ధ్వజమెత్తింది. సంపదను సమయం చేయడానికి భరణం ఒక మార్గం కాదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. సమమైన భరణం కోరడంపై ధర్మాసనం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. చాలా మంది ఈ విధంగానే కోరుతున్నారని.. ఇలాంటి కేసులే ఎక్కువ అవుతున్నాయని తెలిపింది. ఒక వేళ భర్త పేదవాడిగా మారితే.. భార్య సంపదను సమం చేయడానికి ఇష్టపడుతుందా? అని బెంచ్ ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

# పదేళ్లు తెలంగాణ గొంతు నొక్కారు

**శాసనసభ / హైదరాబాద్:** అధికారంలో ఉన్నప్పుడు పదేళ్లు తెలంగాణతో పాటు రాష్ట్ర ప్రజల గొంతు నొక్కేశారని, మళ్లీ ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి కూడా అలాగే వ్యవహరిస్తారా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ భారతి 2024 చట్టంపై చర్చజరుగుతున్న సమయంలో ఫార్ములా ఈ కేసుపై చర్చ జరపాలని పట్టుబడుతూ బీఆర్ఎస్ సభ్యులు ప్లకార్డులు నిరసన తెలుపుతున్నారు. ఈ క్రమంలో భూ భారతి చట్టంపై మాట్లాడాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును స్పీకర్ సూచించారు. కూనంనేని మాట్లాడుతూ.. దేశంలో వివిధ అంశాలపై చాలా మందిపై కేసులు పెడతారని, మీ ఒక్కరి మీదే కేసు పెట్టారా అంటూ బీఆర్ఎస్ సభ్యులని ప్రశ్నించారు. గడిచిన పదేళ్లు ప్రజలతో పాటు విపక్షాల గొంతును కూడా నొక్కారని, రేవంత్‌రెడ్డిని కూడా 5 నిమిషాల కంటే ఎక్కువ సభలో మాట్లాడనివ్వలేదన్నారు. ఇప్పుడూ మీరు చెప్పిందే జరగాలంటే ఎలా అంటూ కూనంనేని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను నిలదీశారు. సభలో బీఆర్ఎస్ సభ్యులు నిరసన చేస్తుండగా వారి చేతికి అందిన కాగితాన్ని అందినట్టు చించివేస్తున్నారని కూనంనేని అన్నారు.

# హెచ్ఎండీఏ అధికారుల్లో గుబులు

## ఒకవైపు ఫార్ములా ఈ రేస్‌పై ఏసీబీ దర్యాప్తు మరోవైపు ఔటర్ రింగ్‌రోడ్డుపై సిట్ విచారణ సంబంధిత విభాగాల అధికారుల్లో హైరానా!

hmda
Growing Global

**శాసనసభ / హైదరాబాద్:** ఓఆర్ఆర్‌ను ప్రైవేటుకు అప్పగించడంపై సిట్ ఏర్పాటుతో హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) అధికార వర్గాల్లో పరేషాన్ మొదలైంది. ఫార్ములా ఈ రేస్ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్న ఏసీబీ.. ఇప్పటికే హెచ్ఎండీఏ ఇన్‌చార్జ్ కమిషనర్ అర్వింద్ కుమార్ (ఏ2), ఇంజనీరింగ్ విభాగం చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డి (ఏ3) పేర్లను చేర్చింది. దీంట్లో ఇంకా ఎవరెవరి పేర్లు చేర్చుతారనే అంశంపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఏసీబీ అధికారులు విచారణకు వీరినే పిలుస్తారా? లేక రేస్ నిర్వహణలో భాగమైన ఇతర అధికారులను కూడా పిలుస్తారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. డబ్బును బదిలీ చేయడంలో హెచ్ఎండీఏ అకౌంట్ విభాగం కూడా కీలకంగా పని చేసిన నేపథ్యంలో.. అందులోని సీఏవో, ఏవో, డీఏవోలు కూడా ఆందోళనకు గురవుతున్నారు. తాము కూడా దర్యాప్తునకు హాజరవ్వాల్సి ఉంటుందా? అని ఆరా తీస్తున్నారు. ఇక.. ఔటర్ రింగ్ రోడ్డును ప్రైవేటు సంస్థకు 30 ఏళ్లకు లీజుకివ్వడంపై సిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లుగా సీఎం రేవంత్ ప్రకటించడంతో హెచ్ఎండీఏలోని హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. సిట్ విచారణకు హెచ్ఎండీఏ కమిషనర్‌తో పాటు హెచ్‌జీసీఎల్‌లోని అప్పటి ఎండీ, ప్రాజెక్టు డైరెక్టర్, సీజీఎం, డీజీఎం హాజరయ్యే అవకాశాలున్నాయి. దీనికి సంబంధించి టెండర్ టెక్నికల్ బిడ్ పరిశీలన, అనుమతిలో పలు ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఐదుగురు చీఫ్ ఇంజనీర్లు కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. టెండర్ ప్రైస్ బిడ్‌ను.. అప్పటి మునిసిపల్ శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఫైనాన్స్ కార్యదర్శి ఇలా సీనియర్ ఐఏఎస్ అధికారుల కమిటీయే ఖరారు చేసి 'ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా'ను ఎంపిక చేసినట్లు తెలిసింది. వీరంతా సిట్ విచారణకు హాజరవుతారా? లేదా? అనేది త్వరలో తెలిసే అవకాశాలున్నాయి.

# పెంపుడు కుక్క రోడ్డుపై మలవిసర్జన చేస్తే రూ.1,000 జరిమానా



శాసనసభ / హైదరాబాద్ : పెంపుడు జంతువులలో కుక్క అత్యంత ప్రజాదరణ పొందిన జంతువు. ప్రపంచవ్యాప్తంగా కుక్క ప్రేమికులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు.కొంతమంది తమ కుక్కను పసిపాపలా చూసుకుంటారు. కొంత మంది తమ కుక్కలను ఉదయం మరియు సాయంత్రం వాకింగ్ కోసం బయటకు తీసుకెళ్లడం మీరు తరచుగాచూస్తాం.ఇక పై గ్రేటర్ హైదరాబాద్ లో పెంపుడు కుక్క రోడ్డుపై మలవిసర్జన చేస్తే జిహెచ్ఎంసి అధికారులు రూ.1,000 జరిమానా విధిస్తారు.అలాగా మిగతా మున్సిపల్ ప్రాంతాల్లోనూ ఈ జరిమానా అమలు చేయాలని జిహెచ్ఎంసి అధికారులుకు మున్సిపల్ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ శ్రీదేవి ఆదేశాలు జారీ చేశారు.

# బీఆర్ఎస్ కు బిగ్ షాక్....? రేవంత్ ను కలిసిన ఇద్దరు ఎమ్మెల్యేలు....!





శాసనసభ / హైదరాబాద్ : ఫార్ములా ఈ రేసు వ్యవహారంలో కేటీఆర్ అరెస్ట్ అవుతున్నారన్న వేళ ఇద్దరు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీకి షాక్ ఇచ్చారు.మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. నియోజకవర్గ సమస్యలపై సీఎంకు వారు వినతి పత్రం అందించారు.అయితే కేటీఆర్ అరెస్ట్ అవుతారన్న ప్రచారం సాగుతున్న వేళ ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు సీఎంను కలవడం హాట్ టాపిగ్ గా మారింది. వీరు పార్టీ మారే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది.ఈ అంశంపై ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు ఎలా స్పందిస్తారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది..

# రాహుల్ గాంధీపై కేంద్ర మంత్రుల విమర్శలు





శాసనసభ / ఢిల్లీ : గురువారం నాడు పార్లమెంట్‌లో చోటుచేసుకున్న సంఘటనలో గాయపడ్డ ఎంపీలు ప్రతాప్ సారంగి, ముఖేష్ రాజపుత్‌లను ఆర్ఎంఎల్ ఆసుపత్రిలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, బండి సంజయ్ పరామర్శించారు.పార్లమెంట్‌లో జరిగిన తోపులాటలో ఇద్దరు ఎంపీలు గాయపడటం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో మొసలి కన్నీళ్లు కారుస్తున్నారు. వరుస ఓటముల కారణంగా ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీలో అసహనం పెరిగిందని విమర్శించారు.అంబేద్కర్ పై గతంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరించిన తీరును గుర్తుచేసిన కిషన్ రెడ్డి.. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ని అవమానించింది కాంగ్రెస్ పార్టీ అని, కేంద్ర మంత్రివర్గం నుంచి రాజీనామా చేయించిన వారు కూడా వారే. ఆయనకు భారతరత్న ఇవ్వకుండా అడ్డుకున్నది ఎవరు? కేంద్ర హాల్లో విగ్రహం పెట్టకుండా అడ్డుకున్నది కూడా వారే అని ఆయన అన్నారు. అంబేద్కర్ ని అడుగడుగునా అవమాన పరిచిన చరిత్ర కాంగ్రెస్‌ది అని మండిపడ్డారు. అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రజల మన్ననలు పొందుతున్నారని కిషన్ రెడ్డి అన్నారు. అంబేద్కర్ గారి ఆలోచనలను ప్రధానమంత్రి మోడీ ఫాలో అవుతున్నారు. ఆయన అడిగిన పంచతీర్థాలను అభివృద్ధి చేసి దేశ ప్రజలకు అంకితం చేశారని తెలిపారు.రాహుల్ గాంధీపై తీవ్ర విమర్శలు చేస్తూ, పార్లమెంట్‌లో టీషర్ట్ వేసుకుని యువకుడిగా కనిపిస్తూ ఎంపీలపై దాడులు చేయడం దారుణం అని అన్నారు. రాహుల్ గాంధీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సంఘటనతో దేశ రాజకీయాలు మరింత వేడెక్కాయి. రాహుల్ గాంధీపై ఈ విమర్శలు, పార్లమెంట్‌లో చోటుచేసుకున్న ఘటన రాజకీయ నేతల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది.

# రాష్ట్ర ప్రత్యేక అవసరాలను గుర్తించి కేంద్రం ప్రోత్సాహం అందించాలి

రామకృష్ణారావు పాల్గొన్నారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలను సమావేశంలో భట్టి వివరించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నుంచి తెలంగాణకు నిధులు తక్కువగా వస్తున్నాయని, జనాభా ప్రాతిపదికన కేంద్ర పథకాల్లో రాష్ట్రానికి నిధులు ఇవ్వాలని కోరారు."స్థానిక పరిస్థితులకు తగ్గట్లుగా కేంద్ర పథకాలు ఉపయోగించుకునే వెసులుబాటు ఉండాలి. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన రూ.1800 కోట్ల పెండింగ్ గ్రాంట్లు విడుదల చేయాలి. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి ఏడాదికి రూ.450 కోట్ల నిధులు మరో ఐదేళ్ల పాటు పొడిగించాలి. తెలంగాణలోని వెనకబడిన జిల్లాల్లో పారిశ్రామిక సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులకు నిధులు మంజూరు చేయాలి. స్మార్ట్ సిటీస్ మిషన్ పొడిగించాలి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగానికి పీఎల్ఐ పథకాన్ని అమలు చేయాలి" అని భట్టి కోరారు.

# జైలుకెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు?

గవర్నర్ క్లియరెన్స్ ఇచ్చిన కేసుకు సభలో చర్చ అవసరం లేదని చెప్పారు. బీఏసీలో ఫార్ములా ఈ-రేసు మీద చర్చ కోసం భారాస ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. ముసుగు వేసుకుని భారాస రాజకీయం చేస్తోందని విమర్శించారు."జైలుకు వెళ్లి యోగా చేస్తానన్న కేటీఆర్ ఎందుకు భయపడుతున్నారు. తప్పు చేయకపోతే విచారణ ఎదుర్కొని నిర్దోషిగా బయటికి రావచ్చు కదా? కేటీఆర్ తన సమస్యను రాష్ట్ర ప్రజల సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ కేసులు ఎదుర్కొన్న నాయకులు కోర్టుకు వెళ్తే తప్పుపట్టిన ఆయన.. ఇప్పుడు కోర్టు మెట్లు ఎందుకు ఎక్కారు? కేటీఆర్‌కు నిజాయతీ లేదు. లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూర్చే భూ భారతి బిల్లుపై చర్చ జరగకుండా అడ్డుకునే కుట్ర చేస్తున్నారు. వాళ్ల భూ కబ్జాల బాగోతం బయట పడుతుందనే ఇలా చేస్తున్నారు.చట్టం ముందు సమానులే.. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణ ఎదుర్కోవాల్సిందే" అని సీతక్క చెప్పారు.

# ఢిల్లీ బీజేపీ ఆఫీస్ దగ్గర అనుమానిత బ్యాగ్ కలకలం



శాసనసభ / హైదరాబాద్ : దేశ రాజధాని ఢిల్లీలో అనుమానిత బ్యాగ్ తీవ్ర కలకలం రేపింది. బీజేపీ ప్రధాన కార్యాలయం దగ్గర అనుమానిత బ్యాగ్ ప్రత్యక్షమైంది. దీంతో బీజేపీ శ్రేణులు పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేస్తున్నారు. పోలీసులు కార్యాలయం వెలుపల క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. కనుగొన్న బ్యాగుపై పోలీసు స్టిక్కర్ ఉందని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉందని.. ప్రజలు ప్రశాంతంగా ఉండొచ్చని అధికారి పేర్కొన్నారు. ముందు జాగ్రత్తగా ఆఫీస్ చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేసినట్లు వెల్లడించారు. బ్యాగ్ మూలాలను గుర్తిస్తున్నామని.. ముప్పును తోసిపుచ్చలేమన్నారు. శుక్రవారం ఢిల్లీ బీజేపీ కార్యాలయం దీన్ దయాళ్ ఉపాధ్యాయ మార్గ్ వెలుపల అనుమానిత బ్యాగ్ ఉండడం పార్టీ శ్రేణులు గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో భద్రతా సిబ్బంది హెచ్చరికలు జారీ చేశారు. పోలీసులు వెంటనే ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి దర్యాప్తు కోసం బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. అయితే బ్యాగ్‌పై పోలీసు స్టిక్కర్ ఉండడం గమనార్హం. ఎవరైనా మరిచిపోయారా? లేదంటే కావాలనే వదిలేశారా? అన్నదానిపై దర్యాప్తు చేస్తున్నారు.జాగ్రత్తగా భద్రతను కట్టుదిట్టం చేశారు. అయితే ప్రజలు మాత్రం ఎలాంటి భయాందోళన చెందొద్దని పోలీసులు హామీ ఇచ్చారు.

# ధరణి సాఫ్ట్ వేర్‌లో ఎలాంటి తప్పులు లేవు.. ధరణి వచ్చాకే రైతులకు లాభాలు



శాసనసభ / హైదరాబాద్ : ఈరోజు అసెంబ్లీ సమావేశాల్లో ధరణి పోర్టల్ పై చర్చ జరిగింది. ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి తీసుకొచ్చారు.ఈ క్రమంలో భూ భారతి బిల్లుకు శాసన సభ ఆమోదం కూడా తెలిపింది. అసెంబ్లీ సమావేశాలు అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. కొద్ది మందికి జరుగుతున్న నష్టం పేరు మీద ధరణి రద్దు చేసి భూ భారతి తీసుకొచ్చిందని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇది రియల్ ఎస్టేట్ బ్రోకర్లకు తెలంగాణ ప్రభుత్వం పడుతున్న మంగళ హారతి అని ఆరోపించారు. కోటి 70 లక్షల రైతులకు నిద్ర లేకుండా చేస్తుంది ఈ చట్టం.. లేనివి ఉన్నట్లు, ఉన్నవి లేనట్టు చూపించే ప్రయత్నం చేస్తుంది ప్రభుత్వం అని దుయ్యబట్టారు. ఒక కుక్కను చంపాలంటే.. దానిని పిచ్చి కుక్కగా చూపిస్తారు. అదే విధంగా ధరణి విషయంలో కూడా ప్రభుత్వం చేసిందని ఆరోపించారు. ధరణి వచ్చాకా రైతులకు అనేక లాభాలు జరిగాయి.. రియల్ టైమ్ అప్ డేట్ అయ్యింది.. ఎలక్ట్రానిక్ పాస్ బుక్ వెంటనే వచ్చేలా చేసింది ధరణి అని అన్నారు.86 సంవత్సరాల తరువాత ఏ రాష్ట్రంలో జరగని భూ రికార్డులు ప్రక్షాళన చేసింది కేసీఆర్ అని పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. కేసీఆర్ విదేశాల నుండి సాఫ్ట్‌వేర్ తెచ్చాడని రేవంత్ రెడ్డి అన్నారు.. ఇప్పుడు ఆ సాఫ్ట్ వేరే మీరు వాడుతున్నారని విమర్శించారు. ధరణి సాఫ్ట్ వేర్‌లో ఎలాంటి తప్పులు లేవు.. సాఫ్ట్ వేర్ ఎవరికీ తాకట్టు పెట్టలేదని అన్నారు. ఇప్పుడు ఇదే సాఫ్ట్ వేర్‌ను భూ భారతి పేరుతో వాడబోతున్నారని పల్లా పేర్కొన్నారు. మళ్ళీ మన్యువల్ పహాణీలు, ఫౌతి సిస్టం తీసుకొస్తామని అంటున్నారు.. ఇది తిరోగమన చర్య అని అన్నారు. దీనితో మళ్ళీ లంచాల వ్యవస్థ ముందుకొస్తుందని వెల్లడించారు. తెలంగాణ రైతుల్లో మళ్ళీ ఆందోళన మొదలైంది.. ఈ చట్టం ద్వారా రైతులకు నిద్ర లేకుండా చేస్తున్నారు.. ఈ చట్టాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని పల్లా రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. పదే పదే ఒక్క వ్యక్తి కోసం కొట్లాడుతున్నారు అంటున్నారు.. కానీ తాము నాలుగు కోట్ల మంది ప్రజల కోసం కొట్లాడుతున్నామని తెలిపారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ పాలన వల్ల ఫార్ములా ఈ రేస్ సంస్థ లండన్‌లో కేసు పెట్టిందని దుయ్యబట్టారు. మరోవైపు.. ఈరోజు పోడియం వద్దకు వెళ్లి పోరాటం చేశాం.. అసెంబ్లీ లోపల సెక్యూరిటీ పెట్టుకొని సభ నడుపుతున్నారంటే.. ఎంత చేతకాని వాళ్ళో అర్థం అవుతుందని మండిపడ్డారు. హైదరాబాద్‌ను ప్రపంచ వ్యాప్తంగా గొప్పగా కేటీఆర్ చూపించాడు.. రేవంత్ రెడ్డి ఓటుకు నోటు కేసులో చిప్ప కూడు తిన్నాడు కాబట్టి.. అందరికీ చిప్ప కూడు తినిపించాలని అనుకుంటున్నాడని ఆరోపించారు. ఇదే కేటీఆర్‌కి.. రేవంత్ రెడ్డికి ఉన్న తేడా అని అన్నారు. సభలో ఏక పక్షంగా తమ వీడియో మాత్రమే విడుదల చేశారు.. తెలంగాణ ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటం తెలంగాణ ప్రజానీకానికి చూపించినందుకు ధన్యవాదాలు అని అన్నారు. షాద్ నగర్ ఎమ్మెల్యే చెప్పు చూపిన వీడియో కూడా బయట పెట్టాలని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు.

# బీజేపీ వాళ్లు దేవుడిని మొక్కి పబ్లిసిటీ చేసుకుంటారు..




శాసనసభ / హైదరాబాద్ : బీజేపీ వాళ్లు దేవుడిని మొక్కి పబ్లిసిటీ చేసుకుంటారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా కి రాహుల్ గాంధీ కి తేడా ఉందని తెలిపారు.రాహుల్ గాంధీ రోజు దేవుడిని మొక్కుతారు కానీ పబ్లిసిటీ చేసుకోరు కానీ.. బీజేపీ వాళ్లు దేవుణ్ణి మొక్కి పబ్లిసిటీ చేసుకుంటారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అంబేద్కర్ రాజ్యాంగం అంటే దేశ ప్రజలకు ఒక ధైర్యం ఒక కవచం అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం వల్లనే మోడీ అయినా అమిత్ షా అయినా పదవులు అనుభవిస్తున్నారని తెలిపారు. అంబేద్కర్ కు రాజ్యాంగ నిర్మాణానికి ప్రోత్సహించింది.. ఇచ్చింది జవహర్ లాల్ నెహ్రూ.. దాన్ని కాపాడడానికి అహర్నిశలు కృషి చేస్తున్నది నెహ్రూ ముని మనవడు రాహుల్ గాంధీ అన్నారు.దేశ ప్రజలు ఈరోజు ప్రశాంతంగా జీవిస్తున్నారు అంటే అంబేద్కర్ రాజ్యాంగ ఫలితమే అన్నారు. అది మార్చాలని బీజేపీ ప్రయత్నం చేస్తుందన్నారు. అందుకే రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణకు పోరాటం చేస్తున్నారు దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాజకీయ కుట్ర చేసి రాహుల్ గాంధీనీ గత సంవత్సరం పార్లమెంట్ లో ఉండకుండా కుట్రలు చేశారని తెలిపారు.అయిన అంబేద్కర్ ని అవమానించిన అమీత్ షా క్షమాపణ చెప్పే వరకు రాహుల్ గాంధీ పోరాటం ఆపరని తెలిపారు. రాహుల్ గాంధీ ఏ పిలుపు నిచ్చిన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అంబేద్కర్ ను కేంద్ర మంత్రి అమిత్ షా ను అవమినిచిన విధానం పై రాహుల్ గాంధీ గళం విప్పారని తెలిపారు.

# వదిలేసి వెళ్లిన ఇన్నోవా కారులో 52 కేజీల బంగారం, రూ.10 కోట్ల నగదు!

మధ్యప్రదేశ్ లోని భోపాల్ నగరంలో ఆదాయ పన్ను శాఖ అధికారులు, లోకాయుక్త పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ఆసక్తికర దృశ్యం ఆవిష్కృతమైంది. అటవీ మార్గం గుండా పెద్ద ఎత్తున బంగారాన్ని తరలిస్తున్నారన్న సమాచారంతో పెద్ద ఎత్తున పోలీసు బలగాలు, ఐటీ అధికారులు రంగంలోకి దిగారు. నగర శివార్లలోని మెండోరీ ప్రాంతంలో వారికి నిలిపి ఉంచిన ఓ ఇన్నోవా కారు కనిపించింది.ఆ కారులో ఉన్నవారు తప్పించుకుపోకుండా 30 పోలీసు వాహనాలతో 100 మంది పోలీసులు చుట్టుముట్టారు. కారును తనిఖీ చేసిన అధికారులు నివ్వెరపోయారు. అందులో ఎవరూ లేకపోగా... ఏకంగా 52 కిలోల బంగారం, రూ.10 కోట్ల నగదు కనిపించాయి. బంగారం, నగదుతో ఉన్న రెండు బ్యాగులను ఆ కారు నుంచి స్వాధీనం చేసుకున్నారు.ఆ ఇన్నోవా కారును గ్వాలియర్ కు చెందిన చేతన్ గౌర్, సౌరభ్ శర్మ అనే వ్యక్తులకు చెందినదిగా గుర్తించారు. వీరిలో సౌరభ్ శర్మ మాజీ కానిస్టేబుల్. గతంలో ఆర్టీవో ఆఫీసు వద్ద విధులు నిర్వర్తించాడు.కాగా, ఆదాయ పన్ను శాఖ అధికారుల రాడార్ లో పలువురు బిల్డర్లతో పాటు సౌరభ్ శర్మ కూడా ఉన్నాడు. భోపాల్ నగరంలోని ఖరీదైన ప్రాంతంలో ఉన్న శర్మ నివాసంపై ఐటీ అధికారులు గురువారం నాడు దాడులు చేయగా, రూ.1 కోటి నగదు, అరకిలో బంగారం పట్టుబడ్డాయి. అంతేకాదు, విలువైన వజ్రాలు, వెండి కడ్డీలు, ఆస్తి పత్రాలు కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.తాజాగా... అడవిలో వదిలేసి వెళ్లిన ఇన్నోవా కారులోని డబ్బు, బంగారం కూడా సౌరభ్ శర్మకు చెందినవి అయ్యుంటాయని భావిస్తున్నారు. అయితే, బంగారం, నగదు తమవే అంటూ ఇప్పటివరకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో, చెందినవో నిగ్గుతేల్చేందుకు అధికారులు విచారణ ముమ్మరం చేశారు.

# హామీలు అమలు చేయలేకే రేవంత్ రెడ్డి నాటకాలు ఆడుతున్నారు

ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. "పార్ములా-ఈ కార్ రేస్‌పై అసెంబ్లీలో చర్చ జరపాలని మేము అడిగాం. అన్ని విషయాలూ ప్రజలకు తెలియాలనే అడిగాం. మమ్మల్ని బయటకి పంపి సభలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. రేస్ వల్ల రూ.600 కోట్ల నష్టమని ముఖ్యమంత్రి అసత్య ప్రచారం చేశారు. దాన కిషోర్‌కి రాసిన లేఖలో 50 శాతం ఫండ్స్ చెల్లించలేకపోవడంతో అగ్రిమెంట్ రద్దు చేసుకున్నట్లు ఉంది.రూ.47 కోట్లు కట్టనందుకు రద్దు చేసుకున్నామని కంపెనీ చెప్పింది. రూ.600 కోట్ల నష్టం కాదు.. లాభం జరిగింది. ఈ కార్ రేస్ వల్ల హైదరాబాద్‌కు రూ.600 నుంచి రూ.700 కోట్ల లాభం జరిగిందని నెల్సన్ అనే సంస్థ చెప్పింది.అవినీతి ఎక్కడ జరిగింది?. ప్రొసీజర్ ల్యాప్స్ జరిగిందని మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ప్రొసీజర్ ల్యాప్స్ జరిగి ఉంటే ఉండొచ్చు. 192 దేశాల వాళ్లు ఈ రేస్‌ని తిలకించారు. రేస్ వల్ల హైదరాబాద్ ఇమేజ్ పెరిగింది. అవినీతి జరగనప్పుడు ఏసీబీ కేసు ఎలా నమోదు చేస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ ప్రశ్నిస్తున్నారనే కేసులు పెట్టి బదనాం చేయాలని చూస్తున్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక హామీలు ఎలా అమలు చేయాలో అర్థంకాక ఇలా జిమ్మిక్కులు చేస్తున్నారు. లేని దివాళాని పదే పదే చెప్పి రాష్ట్రాన్ని ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఏడాదిలో ప్రజల జీవితాల్లో మార్పు రాలేదు. రేవంత్ రెడ్డి కుటుంబం స్కామ్‌లను కేటీఆర్ బయటపెట్టారు. కేటీఆర్ చేసిన తప్పు ఏంటి?. హైదరాబాద్‌ని అభివృద్ధి చేయడమా?" అని అన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

# 'ఆ చట్టాలు మీ భర్తలపై ఆయుధాలుగా వాడేందుకు కాదు'..

అత్తింటి వారి వేధింపుల నుంచి రక్షణ కోసం, మీ సంక్షేమం కోసం చేసిన కఠిన చట్టాలను ఆయుధాలుగా మార్చుకోవద్దని సుప్రీంకోర్టు మహిళలకు హితవు పలికింది. ఆ చట్టాలు మీ రక్షణ కోసమే కానీ భర్తలపై ఆయుధాలుగా ప్రయోగించేందుకు కాదని చెప్పింది. వివాహం అనేది కమర్షియల్ వెంచర్ కాదని వ్యాఖ్యానించింది. విడాకుల సమయంలో కోరే భరణం రీజనబుల్ గా ఉండాలే తప్ప విడిపోయిన భర్తను రోడ్డు మీదికి ఈడ్చేలా కాదని పేర్కొంది. ఈమేరకు గురువారం ఓ విడాకుల కేసులో తీర్పు వెలువరిస్తూ సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ నాగరత్న ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. వివాహం తర్వాత భర్తపై ఆధారపడిన భార్య.. విడాకుల తర్వాత ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిందే భరణం అని సుప్రీంకోర్టు పేర్కొంది. మాజీ భాగస్వామి ఆర్థిక స్థాయికి సరిసమానంగా ఉండేలా భరణం నిర్ణయించలేమని స్పష్టం చేసింది. సామాజిక పరిస్థితులు, జీవనశైలి ఆధారంగా భరణాన్ని రీజనబుల్ గా నిర్ణయించాల్సి ఉంటుందని తెలిపింది. ఇటీవల బెంగళూరు టెకీ అతుల్ సుభాష్ ఆత్మహత్య నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. భార్య వేధింపులు, భరణంగా భారీ మొత్తం డిమాండ్ చేయడం, తప్పుడు కేసులతో కోర్టుల చుట్టూ తిప్పడంతో తీవ్ర ఆవేదనకు గురైన అతుల్ సుభాష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన రాసిన ఆత్మహత్య లేఖ, సెల్ఫీ వీడియో దేశవ్యాప్తంగా సంచలనంగా మారాయి. మహిళల కోసం చేసిన చట్టాలతో మగవాళ్లను వేధింపులకు గురిచేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.

# ఫార్ములా-ఈ కార్ రేస్.. మనీలాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడీ

కేటీఆర్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సుందరం, ప్రభాకర్‌రావు, గండ్ర మోహన్‌రావు వాదనలు వినిపించారు. అవినీతి నిరోధక చట్టం కింద పెట్టిన సెక్షన్లు ఈ కేసుకు వర్తించవని, ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని కోరారు.ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం.. ఈనెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని ఆదేశించింది. కేటీఆర్‌పై ఏసీబీ నమోదు చేసిన కేసులో దర్యాప్తు కొనసాగించవచ్చని స్పష్టం చేసింది. పది రోజుల్లో కౌంటరు దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ధర్మాసనం ఈనెల 27కి వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో తాజాగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసింది.

# సభ్య సమాజం సిగ్గు పడేలా బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరిస్తున్నారు

బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన మధ్యే మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగించారు. భూ భారతి బిల్లును ఆమోదించకుండా బీఆర్ఎస్ అడ్డుకుంటోందని పొంగులేటి మండిపడ్డారు. సభ్య సమాజం సిగ్గుపడేలా ఆ పార్టీ సభ్యులు వ్యవహరిస్తున్నారని అన్నారు. ధరణి పోర్టల్ తప్పులతడక అనే విషయం కేసీఆర్ కు కూడా తెలుసని చెప్పారు. కేసీఆర్ 80 వేల పుస్తకాలు చదివారని... పుస్తకాలను క్షుణ్ణంగా చదివి ధరణి పోర్టల్ ను రూపొందించి ఉంటారని తాము భావించామని అన్నారు. మూడేళ్లకే ధరణి పోర్టల్ కు వందేళ్లు నిండాయని చెప్పారు.భూ భారతి బిల్లును సభలో ప్రవేశ పెట్టినప్పుడు కేసీఆర్ కూడా సూచనలు చేస్తారని భావించామని... కానీ, కేసీఆర్ అసెంబ్లీకి రాలేదని పొంగులేటి విమర్శించారు. సభలో బీఆర్ఎస్ నేతల చిల్లర వేషాలను ప్రజలు హర్షించరని చెప్పారు.

# కేసు విషయంలో నేనేం భయపడడం లేదు..

ఆనాడు ఇదే ముఖ్యమంత్రి ఎంపీగా ఉండి లక్షల కోట్లు అవినీతి జరిగిందని ఆరోపణలు చేశారు.దానికి హెచ్ఎండీఏ రేవంత్ రెడ్డి పై పరువునష్టం దావా వేశారన్నారు. అంతేకాదు ఇప్పుడు పదే పదే కుంభకోణం జరిగింది అని అన్నారు కదా.మరి ఆ పర్మిషన్ రద్దు చేయాలి గా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఓఆర్ఆర్ పై సిట్టింగ్ జడ్జ్ విచారణ జరిపించాలని మేము డిమాండ్ చేస్తున్నామన్నారు. సిట్ అంటేనే ఆయన కోసం పని చేసే అధికారులు ఉంటారని, ప్రమోషన్ కోసం పని చేయాల్సిన వారు ఉన్నారన్నారు.నేషనల్ హైవే వాళ్ళు పెట్టిన టిఓటి ప్రకారమే వెళ్ళాం తప్ప ఇంకోటి లేదన్నారు. పొన్నం ప్రభాకర్ స్పష్టంగా చెప్పాడు అవినీతి జరుగలేదన్నారు. కేస్ ఎవరికి అప్పగించాలో కూడా వారికి తెలియదన్నారు. రూ.50 లక్షలతో పట్టుబడిన వ్యక్తి ఏసీబీ కిందికి వస్తుందని చురకలంటించారు. నిన్న హరీష్ రావు అప్పులపై అద్భుతంగా సభలో ప్రసంగించారన్నారు. దాన్ని వారు తట్టుకోలేదు. అప్పులు చేశారని నిరూపించడంతో కావాలని నిన్న కేస్ నమోదు చేశారన్నారు. అంతేకాదు సిట్ కూడా అందుకే వేశారన్నారు. మంత్రులకు శిక్షణ తరగతులు పెట్టాలి.. ఎమ్మెల్యేలకు పెట్టారు అందుకే చెప్పులు లేపారని, ఇదా వీరు ఇచ్చిన శిక్షణ అని కేటీఆర్ అన్నారు.

# మంత్రులకు సీఎం చంద్రబాబు క్లాసు.. మీ జాతకాలు నా వద్ద ఉన్నాయంటూ హెచ్చరికలు

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు సున్నితంగా క్లాస్ పీకారు. మంత్రులు ఎవరెవరు ఎలా పని చేస్తున్నారో అందరి జాతకాలు తన వద్ద ఉన్నాయని, ఎప్పటికప్పుడు పనితీరుపై సమీక్షిస్తున్నానని సున్నితంగా హెచ్చరించారు. నిన్న జరిగిన కేబినెట్ భేటీ సందర్భంగా సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం.మంత్రులు సచివాలయానికి, క్యాంప్ కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. ఇన్‌చార్జులుగా ఉన్న జిల్లాల్లో కూడా విస్తృతంగా పర్యటించాలని తెలిపారు. కొందరు దస్త్రాల పరిష్కారంలో జాప్యం చేస్తున్నారని, టెక్నాలజీ వాడటం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆరు నెలల పనితీరుపై నివేదిక ఇవ్వాలని కోరితే మంత్రులు రామానాయుడు, సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ మాత్రమే ఇచ్చారని పేర్కొన్నారు.రాజకీయ సమస్యల పరిష్కారానికి మంత్రులు చొరవ చూపాలని సూచించారు. ఇన్‌ఛార్జులుగా ఉన్న జిల్లాల్లో మూడు పార్టీల మధ్య సమన్వయం బాధ్యతలను మంత్రులు తీసుకోవాలన్నారు. మంత్రుల పనితీరుపై ఐవీఆర్ఎస్ సర్వే చేస్తున్నట్లు చెప్పారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయడంలో కొందరు వెనుకబడి ఉన్నారన్నారు. విపక్షాల దుష్ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు.త్వరలో కొణిదెల నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకోనున్నారని, ఆ క్రమంలోనే ముగ్గురు లేదా నలుగురిని మంత్రివర్గం నుంచి తొలగించనున్నారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ తరుణంలో మంత్రుల పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతున్నానని, మీ జాతకాలు తన వద్ద ఉన్నాయని సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేయడంతో పలువురు మంత్రుల్లో కలకలాన్ని రేపుతోంది.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918